ఆ రోజు జరిగిన సంఘటన మా స్కూల్లో పెద్ద సంచలనం సృష్టించింది. అలా జరుగుతుందని ఎవ్వరం ఊహించలేదు.

హెడ్మాస్టర్ ఎవర్ని పిల్చి సాక్ష్యం అడుగుతారోనని అంతా తప్పుకు తిరుగుతున్నారు.

ఒక్కో మూల ఇద్దరేసి ముగ్గురేసి చేరి చెవులు కొరుక్కుంటున్నారు. మధ్యాహ్నం ఏ టీచరూ క్లాసులో పాఠాలు చెప్పడంలేదు మూడు గంటల ప్రాంతంలో హెడ్మాస్టారు స్కూలంతా ఓ రౌండ్ వేశారు.

కాస్త సర్దుమణిగింది.

టీచర్లు పాఠాలు చెప్పడం మొదలెట్టారు.

పిల్లలంతా శ్రద్ధగా కూర్చున్నారు.

* * *

ఆ రోజు పొద్దున్న రెండో పిరియడ్ నాకు క్లాసులేదు. మూడో పిరియడ్ సైన్స్ క్లాస్ పిల్లలచేత ప్రాక్టికల్స్ చేయించాలి.

ఆ వెండర్ని అన్నీ సర్దమని పురమాయించి జాతాఖానీకోసం నేను టీచర్స్‌రూం కెళ్ళాను.

అప్పటికే అక్కడ తెలుగు మాష్టారు వెంకటేశ్వర్లుగారు, డ్రిల్లుమాష్టారు రావు గారు, డ్రాయింగ్ మాష్టారు రాజుగారు సమావేశమయ్యారు.

నే నెళ్ళి వాళ్ళ కబుర్లలో తలదూర్చాను.

అప్పుడే అక్కడ సంచలనం కలిగింది. కనకదుర్గ సుడిగాలిలా లోపలికొచ్చింది. ఆమె ఎందుకంత ఫోర్స్‌గా వచ్చిందో నాకే కాదు- ఎవ్వరికీ అర్థంకాలేదు. అర్థంచేసుకోడానికి ప్రయత్నించకుండానే అంతా జరిగిపోయింది. ఆమె రావడం రావడం డ్రాయింగ్ మాష్టారు రాజుగారి దగ్గరకెళ్ళి ఎదురుగా నిలబడింది. ఆ సమయంలో ఆమె యుద్ధానికి వెడుతున్న లక్ష్మీబాయిలా వుంది.

"ఏమిట్రా- నా గురించి ఏదో కూశావట" రాజుగారి కాలర్ పట్టుకుని అడిగింది.

ఆమెలో అంత కోపాన్ని, ఆమె మాటల్లో అంత కఠినత్వాన్ని రాజుగారు ఊహించలేదు.

"ఏయ్... దుర్గా ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" లేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు.

"తెలుసురా ఆడపిల్ల గురించి మాట్లాడమంటే క్లాసులో బోర్డుమీద కోతి బొమ్మ లెయ్యడమనుకుంటున్నావా?"

"నోర్మూయ్ ..పిచ్చిగా వాగకు..."

అతని మాటల్ని మధ్యలోనే తుంచేసింది.

"నేను కాదురా...పిచ్చిగా వాగేది నీకు పిచ్చి నువ్వు నాకు చీరలు కొన్నావా? ఏకొట్లో కొన్నావేరా? నీకు నావయస్సు ఆడపిల్లుంది. మనవణ్ణి ఎత్తిన వెధవ్వి-నువ్వు చేయాల్సిన పనులేనా ఇవి-నువ్వు మనిషివా- పశువ్వా?...

దుర్గ ఆవేశంతో ఊగిపోతోంది. ఆమె అన్న మాటలు రాజుగారిలో మగాణ్ని నిద్ర లేపాయి. ఆ మగాడితో యుగ యుగాలుగా ఉన్న అహంకారానికి కోరలొచ్చాయ్ అంత మందిలో ఆమె అలా తిడుతుంటే మనిషికి సహజమైన ఉడుకుమోత్తనం ఆయన్ని ఆవహించింది.

"నోర్మూయ్... పిచ్చిలంజా........"

ఏవో మాటలుగా బైటికి వచ్చాయి.

దుర్గలో ఆవేశానికి ఆవేశం వచ్చింది. ఆమెలో ఆడది రౌద్రం దాల్చింది.

చివరి తిట్టు బైటికి రాకూడదని ఆమె శపథం పూనినట్టుంది.




ఆమె కాలిచెప్పు ఆయన దవడ మీద పడింది.

ఆమె చెప్పు తొందర పాటుని కూడా ఆయన వూహించలేదు. ''నువ్వు ఆడదా నివేనా?—'' నూతిలోంచి అన్నట్టుగా అన్నాడు.

''వెధవపని చేసింది చాలక ఇంకా వాగుతా వెందుకు?'' ఆమె చేతిలోని చెప్పు స్పీడ్ అందుకుంది. టప్, టప్, టప్.

ఆయన రెండు చెంపలమీద...

విడతీద్దామంటే ఆమె ఆడది.

ప్రేక్షకుల్లా చూస్తూ వుండిపోయాం.

''నా గురించి ఎప్పుడైనా ఎక్కడైనా వాగినట్టు తెల్సిందా—నీ అంతం ఖాయం'' జోడు కాలికి తొడుగుకుంటూ అంది. ఎంత వేగంగా వచ్చిందో అంత వేగంగానూ బైటికి వెళ్ళిపోయింది.

చెంపలు సవరించుకుంటున్న రాజుగార్ని చూస్తే నాకు జాలేసింది.

''ఆమె ఎందుకు మిమ్మల్ని చెప్పుతో కొట్టింది మాస్టారూ?'' అనడిగే సంస్కారం మాలో ఎవరికీలేదు.

ఆయన మాకేం చెప్పనూ లేదు.

పది నిమిషాలు బేలగా చూస్తూ ఆయన బైటికి వెళ్ళిపోయారు.

''ఎందుకిలా జరిగి వుంటుంది?'' అన్నది మా ఊహ గానే మిగిలిపోయింది.

నేనా స్కూలికి ట్రాన్స్ఫరై వెళ్ళి అప్పటికో నెల మాత్రమే అయ్యింది. అక్కడి స్టాపులో నాకు నచ్చిన కొద్దిమందిలో దుర్గ ఒకామె ఇరవై రెండేళ్ళ వయస్సుండే దుర్గ పెద్దగా చదువుకోలేదు. పదో తరగతి పాసై ఆ స్కూల్లో రికార్డు అసిస్టెంటుగా పని చేస్తోంది ఆమె భర్త అక్కడే ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా వుంటున్నాడు. అందరితోనూ ఎంతో కలుపు గోలుగా మాట్లాడం, చేతనైనంత వరకు అందరికీ ఉపకారం చెయ్యడం ఆమెలో నాకు నచ్చిన గుణాలు.

నేనక్కడ జాయిన్ అయిన మర్నాడే వాళ్ళింటికి నన్ను భోజనానికి పిలవడం, సుశీల పురిటికి వెళ్ళిన కారణంగా చెయ్యి కాల్చుకునే నాకు ఆవకాయ, మాగాయలు,

పీసాల్లో పెట్టివ్వడంలాంటి సంఘటనలు నా కామెపై మంచి అభిప్రాయాన్ని కలగజేసి వుండవచ్చు. కాని అర్థం కానిదల్లా నాతో పాటు సమానంగా గౌరవించే రాజుగారి మీద ఆమెకెందుకు కోపం వచ్చిందా-అన్నది.

మధ్యాహ్నం మూడున్నరకి ఒక్కణ్ణీ లేబ్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువు కుంటున్నాను.

దుర్గ మెల్లగా లోపలికి వచ్చింది.

ఆమెనప్పుడు చూస్తే ఎవ్వరికీ అపకారం చెయ్యని తెల్ల పావురం గుర్తొచ్చింది.

లోపలికొచ్చి ఎదురుగా కూర్చుంది.

ఇద్దర్లో ఎవరమూ మాట్లాడలేదు.

"నా మీద మీకు అసహ్యంగా వుందా మాస్టారూ ?" తలొంచుకుని అడిగింది.

"అబ్బే-ఎందుకు?" ఎటో చూస్తూ అడిగాను.

"ప్రొద్దుటి నా ప్రవర్తనకి" సూటిగా అంది.

లేదులే-కారణం నాకు తెలియదు-అయినా అలా తొందర పడకుండా వుండాల్సింది-"

ఆమె నిరాశగా చూసింది.

మళ్ళీ నేనే అడిగాను. అసలేం జరిగింది.

ఆమె కళ్ళలో నీళ్ళు......

"నేను అందరితోనూ కాస్త చనువుగా ఉంటాను. అలా వుండటం నా తప్పా!"

డ్రాయింగు మాష్టారికి నా తండ్రి వయస్సుంటుంది. ఆయన చాలా మంచి వాడిలా కనిపిస్తాడు. అందుకే ఆయనతో కాస్త కలివిడిగా మాట్లాడుతాను. మరి ఆయన బుద్ధి ఎందుకిలా వక్రించిందో తెలియదు......స్కూల్లోనూ, ఊళ్ళోనూ, నా గురించి చాలా చెడ్డగా అబద్ధాలు ప్రచారంచేసాడట..."

నాకు జాలేసింది......అయినా నేనేమీ మాట్లాడలేదు.

మళ్ళీ తనే చెప్పింది...

"ఆమధ్య వాళ్ళావిడకు ఒంట్లోసుస్తీ చేసింది. ఆయనిల్లు మాకు దగ్గరవడంతో వీలున్నప్పుడల్లా వెళ్ళి ఆమెను చూసి వస్తుండే దాన్ని. చేతనైన సాయం చేస్తుండేదాన్ని...నేనాయన కోసమే వాళ్ళింటికి వెళ్ళుతున్నానని ప్రచారం చేసాడు.

తనతో రెండుసార్లు సినిమా కెళ్ళానని ఆయన నాకు రెండు చీరలు కొనిచ్చాడని కూడా చెప్తున్నాడట...

ఈ కబుర్లు అలాఅలా పాకి మాఆయన చెవికెక్కాయి. నిన్నరాత్రి పెద్దగొడవ చేసారు...ఆయనో మూర్ఖుడు. రెండేళ్ళ నుంచి ఆయనతో కాపురం చేస్తున్నాను. నా గుణాలేమిటో ఆయనకు తెలియదూ...? నేను చెడుతిరుగుడు తిరుగుతున్నానని, నన్ను పుట్టింటికి పొమ్మని నన్ను నానా మాటలు అన్నారు...

వాకబు చేస్తే రాజుగారే ఈ పుకార్లన్నీ సృష్టించారని ఋజువు అయ్యింది......... అలాంటి వాళ్ళకి వెంటనే బుద్ధి చెప్పాలి... లేకపోతే ఇలా ఎంత మంది గురించి చెడ్డగా చెప్తారో......?

ఇవాళ స్కూల్లో చేసింది మా ఆయనతో చెపుతాను. ఆయన నమ్మేరా సరేసరి...... లేకపోతే ఆయన ఖర్మ......నేను మాత్రం ఛస్తే పుట్టింటికి పోను....ఇప్పుడు చెప్పండి నేను తొందర పడ్డానంటారా ?"

ఆమె చెపుతున్నంత సేపు బాధ, ఏడుపు ఉడుకు మోత్తనం కలగాపులగంగా వచ్చాయి.

ఆమె ధైర్యానికి మనస్సులోనే జోహార్లు అనుకున్నాను.

"అన్నీ అవే సానుకూలపడతాయి. బాధ పడకమ్మా—" అన్నాను. ఇంతలో పిరియడ్ అయిన గంట మోగింది. నాకు క్లాసుంది వెడతాను," అంటూ లేచాను.

ఆమె కూడా లేచి బైటికి వెళ్ళిపోయింది.

దుర్గ పెద్దగా చదువుకోలేదు. పదో తరగతి పాసైంది. అంతర్జాతీయ మహిళా సంవత్సరం గురించి, దశాబ్దం గురించి ఆమెకేమీ తెలియదు. ఆసందర్భంగా ఏ సమావేశాలకీ ఆమె వెళ్ళలేదు. స్త్రీజనోద్ధరణ కోసం కంకణం కట్టుకుని వందల మంది రాసిన వేల నవలలో ఏ ఒక్కటీ ఆమె చదవ లేదు. భారతదేశంలో స్త్రీ దోపిడీకి గురౌతుందని, ఆమె నా దోపిడీ నుంచి రక్షించాలనీ గొంతు చించుకుని అరుస్తున్న ఏ మేధావి గొంతూ ఆమె వినలేదు. ఆమె గొప్పతెలివైంది, కాదు.

కాని తన మనుగడకి, తన ప్రతిష్టకి తన ఆత్మగౌరవానికి ఒకడు సవాల్ విసిరినప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో ఆమెకు బాగా తెలుసు. ఆ విద్యను ఆమెకు జీవితం నేర్పింది. దాన్నే ఇంగ్లీషులో నాచురల్ జస్టిస్ అంటారు. దానికి ప్రాకృత న్యాయం—అని అర్థం చెప్పుకోవచ్చు—అంతే! *


అపూర్వమయిన అవకాశము ట్రాన్సిస్టర్ల అమ్మకానికి ఉద్దేశించిన పథకం

నమూనా మొత్తం 50

| | | | |
|---|---|---|---|
| 11 | 16 | 9 | 14 |
| 20 | 5 | 18 | 7 |
| 13 | 12 | 15 | 10 |
| 6 | 17 | 8 | 19 |

మొదటి బహుమతి : వెయ్యి రూపాయల నగదు అన్ని అంకెలు సరిగా ఉండాలి. రెండవ బహుమతి : 500 రూపాయల నగదు. పై మూడు వరుస అంకెలు సరిగా ఉండాలి. మూడవ బహుమతి : (200 లేదా పాల్గొను వారందరికీ) 270 రూపాయల విలువయిన మూడు బ్యాండ్ల సోని ట్రాన్సిస్టరు ఏ అంకె సరిగా ఉన్నా ఇవ్వబడును. క్రింది నిబంధనలు జాగ్రత్తగా గమనించ ప్రార్థన. 1. 6 నుండి 21 వరకు గల సంఖ్యలను మాత్రమే వాడాలి. ఏ వైపు నుండి కూడినా మొత్తం 54 రావాలి. 2. సీలు వేసిన సోల్యూషన్ మా కార్యాలయంలో ఉన్నవి ఎం. డి. సమక్షంలో తెరవబడుతుంది. 3. ఎంట్రీ ఫీజు లేదు. మా కార్యాలయంలోని సోల్యూషన్‌తో సరిగా ఉన్న ఎంట్రీలకే మొదటి రెండు బహుమతులు ఇవ్వడం జరుగుతుంది. 4. తృతీయ బహుమతి గెలుపొందిన వారు తపాల ఖర్చులు భరించాల్సి ఉంటుంది. 5. మూడవ బహుమతి గెలుపొందిన వారికి నగదు బహుమతి ఇవ్వబడదు. 6. ఫలితాల కోసం 45 పైసల పోస్టేజి పంపాల్సి ఉంటుంది. 7. ఒక పోటీదారుడు ఒక్క ఎంట్రీ మాత్రమే పంపాలి. 8. ఎటువంటి వాజ్యమయినా అలీగడ్ సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.

ముగింపు తేదీ : 24-3-77 ఫలితాలు ; 26-3-77

**Mayur Traders (PT-54) Jaigang ALIGARH-30**